ప్రజాశక్తి

శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | 5 | అనంతపురం



విరివిగా ఉపాధి పనుల కల్పన

2025-26 ఆర్థిక సంవత్సరంలో మరింత ఎక్కువగా పనులు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో విరివిగా ఉపాధి పనులు కల్పించే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 2024-25వ ఆర్థిక సంవత్సరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాధించిన ప్రగతి, 2025-26వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు 109.25 లక్షల పనిదినాలు కల్పించి, రూ.287.01 కోట్లను వేతనాల రూపంలో కూలీలకు అందిచామన్నారు. నీటి నిల్వ, సంరక్షణ పనుల కింద 238 చెరువుల్లో పూడిక తీత పనులు, 575 సేద్యపు నీటి కుంటలు, 1,276 కొండల్లో నీటి నిల్వ కందకాలు, 2,347 డగ్ అవుట్ పాండ్స్, 374 పంట కాలువలలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. మౌలిక వసతులకు సంబంధించి 194.57 కిలోమీటర్ల సిసి రోడ్లను రూ.73,86,18000తో 10.39 కిలోమీటర్ల బిటి రోడ్లను రూ.4,85,60,000తో, 7.25 కిలోమీటర్ల సిసి డ్రైన్స్‌ను రూ.3,93,60,000తో 1,437 పశువుల షెడ్లను రూ.29,16,90,000తో చేపట్టామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 120.00 లక్షల పనిదినాలు కల్పించి రూ.375.00 కోట్లను వేతనాల రూపంలో చెల్లించడానికి లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 646 పశువుల నీటితొట్టెల నిర్మాణాలు, 31 చెరువుల పునరుద్ధరణ పనులు, 9 వేల ఫారంపాండ్స్ నిర్మాణాలు, 93 కిలోమీటర్ల మేర సప్లై, ఫీడర్ ఛానల్‌లో యందు పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కూలీకి సగటు వేతనం రూ.307 పొందే విధంగా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి పనులు చేపడుతామన్నారు. కూలీలు ఉపాధి పనులను విరివిగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, పాల్గొన్నారు.

అనంతలో జోరు వాన..!



అనంతలో కురుస్తున్న వర్షం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్లో జలమయం అయిన రహదారి

- నగరంలో రోడ్లన్నీ జలమయం
- నిలిచిన విద్యుత్ సరఫరా
- పిడుగుపాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వాన పడింది. అనంతపురం నగరంలో ఎడతెరిపి లేని వర్షం పడింది. వర్షంతో ప్రధాన కూడళ్లన్నీ జలమయం అయ్యాయి. నగరంలోని సప్తగిరి సర్కిల్ , శ్రీకంఠం సర్కిల్‌తోపాటు, బస్టాండు ఆవరణం మొత్తం నీటితో నిండిపోయాయి. ఈ సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. శింగనమల, బుక్కరాయసముద్రం, పామిడి, పెద్దపప్పూరు తదితర మండల ప్రాంతాల్లోనూ వానపడింది. మండు వేసవిలో ఎండతో సతమతం అవుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. చల్లని వాన జల్లులు పడటంతో వేసవి తాపం నుంచి కొంత ఉపసశమనం లభించినట్ట యింది. గత కొన్ని రోజులుగా జిల్లాలో వేసవి తాపం పెరిగిన విషయం తెలిసిందే. 41 డిగ్రీల వరకు ఉష్ణో గ్రతలు నమదవుతూ వచ్చాయి. ఇటువంటి తరుణంలో వానలు పడటంతో ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది. మరో మూడు రోజులపాటు వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ సూచిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తేలిక పాటి వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .

కూలిన భవనం సైడ్‌వాల్

గురువారం కురిసిన వర్షంకు నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా ప్రారంభించిన ఒక కార్పొరేట్ బట్టల దుకాణం సైడ్‌వాల్ కూలింది. నిర్మాణం పూర్తవకనే దీని ప్రారంభం జరిగింది. ఇప్పుడు ఈ భవనం మూడవ అంతస్తు నుంచి సైడ్ విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ వెళ్లకపోవడంతో ముప్పు తప్పింది.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మరో మూడు రోజులు పిడుగులతో కూడిన వానలు పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంత కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు ఈ మేరకు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వర్షం, గాలులకు కూలిన అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ కార్పొరేట్ బట్టల దుకాణం ప్రహరీ

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన మహిళ ఇంద్రజ(ఫైల్ ఫొటో)

గుంతకల్లు రూరల్ : అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదిరిపల్లిలో గురువారం సాయంత్రం పిడుగుపడి ఓ మహిళ మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కదిరిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రజ(25) తన భర్త వెంకటరమణతో కలిసి పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఇంద్రజ మరణించగా ఆమె భర్త తృటిలో ప్రాణాలతో బయట పడ్డాడు. మృతురాలికి ఒకటిన్నర సంవత్సరం కూతురు ఉంది.

నార్పల్లో మూడు పాడిఆవులు....

నార్పల : మండల కేంద్రం గవ్వల వీధికి చెందిన పాడి రైతు సుదర్శన్ మురళికి చెందిన మూడు పాలిచ్చే అవులు గురువారం సాయంత్రం పిడుగు పడి మరణించాయి. ఉరుములతో కూడిన వర్షం వస్తున్న సమయంలో పిడుగు పడి తన ఇంటి వద్ద ఉన్న మూడు ఆవులు చనిపోయాయి.

గవర్నర్‌ను కలిసిన జెఎన్‌టియు విసి

14వ స్నాతకోత్సవానికి ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెఎన్‌టియు విసిహెచ్.సుదర్శన రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ యస్.అబ్దుల్ నజీర్‌ను గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ యూనివర్సిటీ అభివృద్ధిపై విసితో మాట్లాడారు. జెఎన్‌టియును గ్రీన్ యూనివర్శిటిగా తీర్చిదిద్దాలన్నారు. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు తీసుకుని యూనివర్శిటీ మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. యూనవర్సిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి విసి గవర్నర్‌కు తెలియజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న డా॥వంశీకృష్ణ

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాడు పాతూరు ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్లో విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్కూలు స్థాయి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో "మూఢనమ్మకాలు శాస్త్రీయ దక్పథం"అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో అనంతపురానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి రావడం గర్వకారణమని జెవివి నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలియజేశారు. శాస్త్రీయ దక్పథం కలిగిన సమాజ నిర్మాణంలో జెవివి కీలక పాత్ర పోషిస్తుందని, ఇందుకు మంచి ఉదాహరణ ప్రశాంతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో తరిమెల అమర్ నాథ్‌రెడ్డి, సలీం, స్కూల్ యాజమాన్యం ఎన్ఎం.ఇక్బాల్, షమీం, జెవివి నగర నాయకులు రామిరెడ్డి, తిరుపాలు, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పచ్చి రొట్టె విత్తనాల సబ్సిడీ ఖరారు

ప్రజాశక్తి-అనంతపురం

పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల సబ్సిడీ ధరలను ప్రభుత్వం గురువారం ఖరారు చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పచ్చిరొట్టె ఎరువులు కావాల్సిన రైతులు జీలుగ పూర్తి ధర క్వింటాలుకు రూ.12,300 కాగా యాభై శాతం సబ్సిడీ పోను రూ.6,150 రైతు చెల్లిచాలన్నారు. జనుము క్వింటా పూర్తి ధర రూ.10,900 కాగా సబ్సిడీ పోను రూ.5450, పిల్లి పెసర క్వింటా పూర్తి ధర రూ.18,000 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.9,000 రైతు చెల్లించాలన్నారు. అనంతపురం జిల్లాకు జీలుగా 190 క్వింటాళ్లు, పిల్లి పెసర 15 క్వింటాళ్లు, జనుము రెండు క్వింటాళ్లను ప్రభుత్వం కేటాయించిదన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నాన్ సబ్సిడీ ధరను చెల్లించి వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బాల్యవివాహాలతో అనర్థం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉన్నాయని ప్రభుత్వ వైద్యులు డా॥డి.ఇందిరా ప్రయదర్శిని తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. చిన్నతనంలో వివాహం చేస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అయ్యి వారి జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పి.రమ్యశ్రీ, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఎఎన్ఎం.తస్నీమ్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తున్న తోపుదుర్తి సోదరులు

- టీవీ బాంబు కాదు.. కారు బాంబు గురించీ మాట్లాడండి..!
- వైసిపి పాలనలో నష్టపోయిన వారందరినీ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించాలి
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు నియోజకవర్గంలో కక్షలు సమసిపోయి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్‌ను ప్రేరేపించేలా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు వ్యవహరిస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. గురువారం అనంతపురంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడారు. తోపుదుర్తి సోదరులకు ప్రతిదానినీ రాజకీయం చేయడం అలవాటుగా మారిందన్నారు. టీవీ బాంబు గురుంచి మాట్లాడుతున్న వారికి కారు బాంబు గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు. గతంలో జరిగిన ఫ్యాక్షన్ కక్షలతో పరిటాల, కనముక్కల, గంగుల కుటుంబాలు చాలా నష్టపోయాయని చెప్పారు. ప్రస్తుతం అన్నీ మర్చిపోయి ప్రశాంతంగా ఉన్న సమయంలో తోపుదుర్తి సోదరులు మళ్లీ ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వార్థం కోసం తోపుదుర్తి సోదరుల ఉచ్చులో పడొద్దని గంగుల, కనుముక్కల కుటుంబాలకు హితవు పలికారు. అధికారంలో లేనప్పుడు మాత్రమే కనుముక్కల, గంగుల కుటుంబాలు తోపుదుర్తి సోదరులకు గుర్తుకు వస్తాయన్నారు. పాపంపేట 106 సర్వే నెంబర్‌లో 63 సెంట్లలో నిర్మాణాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలగించారన్నారు. ఈ ఇళ్ల కూల్చివేతను తాము అడ్డుకునే ప్రయత్నం చేశామన్నారను. ఇప్పుడు దీనిపై రాజకీయం చేస్తున్న తోపుదుర్తి సోదరులు ఇళ్లు కూల్చివేస్తుంటే ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. తమ అధినాయుడు ఆదేశాల మేరకు రామగిరి ఎంపీపీ అధ్యక్ష ఎన్నికకు తాము దూరంగా ఉన్నామని చెప్పారు. వైసిపి ఎంపిటిసిలను వారే కిడ్నాప్ చేసి తమపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసిపి హాయంలో బాధితులనూ జగన్ పరామర్శించాలి

వైసిపి పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో దాడులకు గురైన వారందరినీ జగన్మోహన్‌రెడ్డి పరామర్శించాలని పరిటాల సునీత కోరారు. పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య మతి ఘటన దురదృష్టకరం అన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే తమ పార్టీ మంత్రి, ఎంపీని బాధిత కుటుంబం వద్దకు పంపామని చెప్పారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా తోపుదుర్తి సోదరులు లింగమయ్య కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదన్నారు. రాజకీయ కక్షలు పురిగొల్పేందుకే జగన్ జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు. తన భర్త పరిటాల రవి హత్యలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాత్ర ఉందన్నారు. సిబిఐ సైతం జగన్‌ను విచారించిందన్నారు.

బిల్లులు ఇవ్వకుంటే పనులెలా చేయాలి..?

కమిషనర్ ఎదుట కాంట్రాక్టర్ల ఆవేదన - కాంట్రాక్టర్లకు సహకరిస్తాం.. పనులు ఆపొద్దంటూ కమిషనర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'సొంత డబ్బులు వెచ్చించి నగరంలో అభివృద్ధి పనులు చేశాం. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా బిల్లులు రాలేదు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు కూడా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం మోసం చేసింది. ఇలాంటి సమయంలో అభివృద్ధి పనులను ఎలా చేయాలి.' అంటూ గుత్తేదారులు కమిషనర్ బాలస్వామి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బిఎల్.నరసింహాతో పాటు డిఈఈలు, ఏఈలతో కలిసి కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కూడా ఒక్క రూపాయి కూడా బిల్లులు తమ ఖాతాల్లో పడలేదన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లులను వెనక్కు పంపడం మరింత నిరాశకు గురి చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో పాత బిల్లులు రాకుండా పనులు చేపట్టలేమని తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ గతంలో ప్రభుత్వం చెప్పినట్లుగా మున్సిపాలిటీ నిధులను వినియోగించుకుని బిల్లులు చెల్లించే అవకాశాన్ని కల్పిస్తూ త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ ఉత్తర్వులు వచ్చిన వెంటనే గుత్తేదారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పనులను ఆపకుండా చేపట్టాలని కోరారు. చేసిన పనులకు బిల్లులు త్వరగా వచ్చేందుకు చేయాల్సిన అన్ని పనులనూ కార్పొరేషన్ ద్వారా చేయిస్తామని చెప్పారు. సిఎఫ్ఎంఎస్ నుంచి వెనక్కు వెళ్లిన బిల్లులను ప్రభుత్వ ఆదేశాల మేరకు విడుదల చేయించే చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ హామీతో ఇద్దరు గుత్తేదారులు వారి పరిధిలోని పనులను పూర్తి చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మరికొందరు ఏ సమాధానం ఇవ్వలేదు. నామినేషన్ వర్కులను టెండర్ పద్ధతుల నిర్వహించాలని కాంట్రాక్టర్లు కోరారు.



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

విద్వేషాలను రెచ్చగొడితే చర్యలు : ఎస్పీ



ప్రజాశక్తి -అనంతపురం క్రైం

సామాజిక మాధ్యమాల్లో కులాలు మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) తదితర సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా అనుచిత, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు, తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా, షేర్‌చేసే వారిపై, అనుచిత, అసభ్య పోస్టులు పెట్టడానికి ప్రోత్సహించటం, సహకరించే వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కుల, మత, ప్రాంతం వారీగా ప్రజల భద్రత, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వాటిని ఉపేక్షించమన్నారు. సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలను ప్రచారం చేయరాదన్నారు. సామాజిక మాధ్యమాలను ప్రజా వ్యతిరేకంగా వినియోగించే వాళ్లపైన సైబర్ నిఘా ఉంటుందని ఎస్పీ తెలియజేశారు.

పెన్షనర్లకు నష్టం చేసే నిర్ణయాలు వద్దు




నిరసనలో పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘం, నేతలు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల నూతన విధానంపై పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సిసిఎస్(పెన్షన్) నిబంధన బిల్లును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. సమాఖ్య నేతలు శివ ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప నేతృత్వంలో పెద్ద ఎత్తున పెన్షనర్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 25న పార్లమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్‌కు అతి ప్రమాదకరమైన బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. మోడీ ప్రభుత్వం పెన్షనర్లపై వివక్ష చూపుతూ వారికి నష్టం చేకూర్చే విధానాలను అమలు చేయడం సరికాదన్నారు. తక్షణం ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్ల పాటు ఉద్యోగులు, పెన్షనర్లు పోరాడి సాధించుకున్న పెన్షన్ హక్కులను హరించే నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమం పెన్షనర్స్ సంఘం నేతలు గోవింద రాజులు, ప్రభాకర్, క్రిష్టప్ప, వేణుగోపాల్, జయరాం, మధుసూదన్, వరదరాజులు, సభ్యులు సత్యనారాయణ, అనంతయ్య, ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఎం.రాజా శేఖర రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏ .విశ్వనాథ, ఎం సుభాన్, పి.బాల రంగయ్య, కుమార్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు లోతైన అవగాహన



డా॥శంషాద్‌బేగంను అభినందిస్తున్న మాణిక్యరావు తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం వైద్య కళాశాల విద్యార్థులకు వైద్య రంగంలో లోతైన అవగాహన పెంచేలా ప్రిన్సిపల్ మాణిక్యరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్, మోర్టాలిటీ సమావేశాలను ప్రతి నెలా మూడు, నాలుగో గురువారం క్రమం తప్పకుండా గత 14 నెలల నుంచి మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం వైద్యశాలలో గత నెల చనిపోయిన వారిలో ముగ్గురు రోగుల వైద్యం గురించి కూలంకుషంగా చర్చిస్తారు. ఈ చర్చల ఫలితంగా భవిష్యత్తులో ఇలాంటి జబ్బు ఉన్న రోగులు వస్తే వారికి మెరుగైన వైద్యం అందించే వీలుంటుంది. ఈ కార్యక్రమం నిర్వహిస్తూ వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించడంలో కృషి చేస్తున్న డాక్టర్ శంషాద్ బేగం, గైనకాలజీ డాక్టర్ నవీన్ కుమార్‌లను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు అభినందించి సత్కరించారు. వీరితోపాటు ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ప్రొఫెసర్లు డా॥బి.శ్రీనివాస్, డా॥శరవన్ సోనియా, డా॥రామస్వామి నాయక్, డా॥ఆత్మరామ్, డా॥శివ శంకర్ నాయక్‌లను అభినందించారు.

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణకు చర్యలు

ప్రజాభీష్టం మేరకు నిర్ణయం తీసుకోవాలి - కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



ఎంఇఒలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం 117 జీవోను ఉపసంహరించుకున్న నేపథ్యంలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతో పాఠశాలల పునర్‌వ్యస్థీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయరాదన్నారు. అంతకుముందు మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఒలు, ఎంఇఒలతో సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీలలో చదువుతున్న ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2 పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఎపిసి శైలజ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, సమగ్ర శిక్ష సీఎంవో గోపాలకృష్ణ, ఎంఇఒలు పాల్గొన్నారు.



అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు

అక్రమ లే అవుట్లు వేస్తే కఠిన చర్యలు

అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా ఆదాయా నికి గండి కొడుతూ.. నిబంధనల కు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ హెచ్చరించారు. ఆయన గురువా రం వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ శర్మతో కలిసి ఉమ్మడి అనంతపురం జిల్లాల పంచాయతీ అధికారులు, ఈవోఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలతో ఆన్‌లైన్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు బృందాలు అహుడా పరిధిలోని 13 నియోజకవర్గాల వ్యాప్తంగా పర్యటించి అనధికార లే అవుట్లను గుర్తిస్తాయన్నారు. వెంచర్లు వేయదలచిన యజమానులు తప్పనిసరిగా అహుడా అనుమతులు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో భవన నిర్మాణాలకు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే అనుమతులు మంజూరు చేయాలని, అనధికార లేఅవుట్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అహుడా సిబ్బంది బుక్కరాయ సముద్రం, రెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. వల్లభ బృందావన్ వెంచర్‌తో పాటు రెడ్డిపల్లిలో వేసిన అనధికార లేఅవుట్‌లలో రాళ్లను తొలగించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. నిబంధనల మేరకు అనుమతులు తీసుకొని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి ఇషాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్‌చౌదరి, బుక్కరాయసముద్రం, రెడ్డిపల్లి పంచాయతీల కార్యదర్శులు పెద్ది శ్రీనివాసులు, సృజన, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడు ఎర్రప్ప ఉద్యోగ విరమణ సన్మానసభకు హాజరైన ఉపాధ్యాయులు

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు ఎర్రప్ప

ఉద్యోగ విరమణ సభలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు ఎర్రప్ప అని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. నగరంలోని నందమూరినగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జిసి.ఎర్రప్ప మార్చి 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందాడు. దీంతో గురువారం బళ్లారి రోడ్డులోని వివిఆర్ ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా నగరంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎర్రప్ప ప్రధానోపాధ్యా యునిగా పని చేసిన జీవితకాలంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు లేకుండా తనదైన శైలిలో నడిపించారన్నారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డు అందుకున్న ఎర్రప్ప ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన సేవలు కోల్పోడం తీరనిలోటు న్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎన్జీవో క్రిష్టప్ప, ఉపాధ్యాయులు రాణి, వాణి, లక్ష్మణ్, వెంకటసుబ్బయ్య, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



గుత్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎఐకెఎంఎస్ నాయకులు

రైతాంగ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-గుత్తి

రైతుల సమస్యలు పరిష్కరించి, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు టి. రామాంజనేయులు, నాయకుడు పి.రాజశేఖర్ శెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ. 20వేలు చెల్లించాలని, సమగ్ర కౌలు చట్టం చేయాలన్నారు. హంద్రీ-నీవా లైనింగ్ పనులకు సంబంధించి జీఓలు 404, 405 రద్దు చేసి లైనింగ్ పనులు ఆపాలన్నారు. కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. హెఎల్సీకి సమాంతర కాలువ నిర్మించాలన్నారు. నిరుపేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున నివాస స్థలం ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఓబిలేసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణి, దస్తగిరమ్మ, లక్ష్మి, షమీనాబేగం, ప్రహ్లాద, రాజు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనలో అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

లక్ష్య, ముస్కాన్, కాయకల్ప లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు, సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. నగరంలోని డిఎంహెచ్ఓ ఛాంబర్‌లో గురువారం ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో సరసమైన, నాణ్యతమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించ డమే జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్దేశం అన్నారు. 3 నెలలకు ఓసారి మొదటి గురువారం జిల్లా స్థాయి క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ మీటింగ్ నిర్వహించాల న్నారు. నాణ్యమైన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి వైద్యాధికారులు, సూపరింటెండెంట్లు, క్వాలిటీ కమిటీలు ఆరోగ్య సిబ్బంది అందరికీ అవసరమైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 8వ తేదీ నిర్వహించే కార్యక్రమంలో ఎన్‌క్యుఎఎస్ సర్టిఫికెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. పామిడి, గుంతకల్లు ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదులను వాట్సప్ ద్వారా డిసిహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వైద్యాధికారులు ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని పనిచేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రమశిక్షణతో పని చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే జిల్లాకు ఎక్కువ సర్టిఫికెట్లు సాధించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించడంతో గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థ అందించిన సర్టిఫికెట్‌ను డిఎంహెచ్ఓ ఈబి దేవికి కలెక్టర్ అందజేశారు. సమావేశంలో డిఎంహెచ్ఓ ఈబి దేవి, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, జిజిహెచ్ఎస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎపి ఎస్ఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, జిల్లా నాణ్యత బృందం అధికారులు స్టీఫెన్, శైలజ, సిహెచ్‌సి, పిహెచ్‌సి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



డిఎంహెచ్ఓ ఈబి.దేవికి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని రామసాగరం గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను గురువారం ఆర్డీవో వసంతబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువను మరింత వెడల్పు చేయాలని ఉద్దేశంతో పనులను పరిశీలించామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సి.షర్మిల, వీఆర్వోలు, అధికారులు ఉన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలపై 7న రాస్తారోకో

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్



సమావేశమైన 544-డి భూనిర్వాసిత రైతులు

న్‌హెచ్-544డి రహదారికి భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై ఈ నెల 7వ తేదీ మండలం లోని యర్రగుంటపల్లి గ్రామ సమీపంలో చేపట్టనున్న రాస్తారోకోలో భూనిర్వాసితులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని యర్రగుంటపల్లి, ఇతర గ్రామాల రైతులు, భూనిర్వాసితులతో గురువారం యర్రగుంటపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గతంలో గ్రామసభ నిర్వహించి జరగబోయే నష్టం చూపించి రెట్టింపు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి, 2018 మార్కెట్ విలువ ప్రకారం చెల్లించడం దుర్మార్గమ న్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి రాజా రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రైతులు దేరంగుల కుమార్, గోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, శంకర్, రంగరాజు, బాల మల్లారెడ్డి, కిషోర్‌రెడ్డి, నాగేశ్వర్, వెంకటరంగయ్య, రసూల్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కమలమ్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-తాడిపత్రి



బాధ్యతలు స్వీకరిస్తున్న కొంకరి కమలమ్మ

రాష్ట్ర ఎస్సీ(మాల) కార్పొరేషన్ డైరెక్టర్‌గా గురువారం అమరావతిలో కొంకరి కమలమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ తనకు ఈ అవకాశం వచ్చేందుకు సహకరించిన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాలల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అండగా ఉంటానన్నారు. కష్టపడిన కార్యకర్తలకు టిడిపిలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, తన కష్టాన్ని గుర్తించి డైరెక్టర్ హోదా అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఆర్ఐటిలో ఘనంగా జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'తరంగ్-2025' పేరుతో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభ, వినూత్న ఆలోచనలను ప్రదర్శించేందుకు ఇది ఉత్తమ వేదికగా నిలిచిందన్నారు. ఉత్సవం ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డా. జి.హేమంత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మొత్తం 1,369 మంది విద్యార్థులు వివిధ ఈవెంట్లకు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, హ్యాకథాన్, కోడ్ బజ్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ మానియా, తదితర సాంకేతిక పోటీలు, ఆసక్తికరమైన ఈవెంట్లు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డా. ఎం.రంజిత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా. యూ.శ్రీనివాస్, డా. సాయి చైతన్య కిషోర్, డా. పి.చిత్రలింగప్ప, విభాగాధిపతులు, అధ్యాపకులు, దేశంలోని వివిధ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

7న ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలో ఈ నెల 7వ తేదీ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభి స్తారని ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. 400 దరఖాస్తులు అందగా మొదటి విడతలో 120 మందికి సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మొదటి బ్యాచ్‌లో 60 మందికి ఉదయం 9 నుంచి 1 గంట వరకూ, రెండో బ్యాచ్‌లో 60 మందికి మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. 400 మందికి దశల వారీగా శిక్షణ ఇచ్చి అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేస్తామని తెలిపారు.



హార్టికల్చర్ రాష్ట్ర సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

8న హార్టికల్చర్ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-పుట్లూరు

ఈ నెల 8వ తేదీ అనంతపురం నగరంలోని జడ్పీ హాలులో నిర్వహించే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సుకు రైతులు, కౌలురైతులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వీటి రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సర్కిల్ సమీపంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. రామాంజనే యులు మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో హార్టికల్చర్ హబ్‌కు విస్తృతంగా నిధులు విడుదల చేయాలని కోరారు. నీటి తడులు తట్టుకునే పండ్ల మొక్కలను అభివృద్ధి చేయాలని, రైతులు పండించే పండ్లు, కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని, దళారీ వ్యవస్థను రూపుమాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్‌యాదవ్, అధ్యక్షుడు ఎన్.గోపాల్‌కృష్ణ, ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణుడు యాదవ్, సహాయ కార్యదర్శి చంద్రశేఖర యాదవ్, నాయకులు పి.వెంకటరాముడు, అంకిరెడ్డి, ఓబుళరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి ఆర్‌డిఓ పరామర్శ

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల ఆర్మీలో ల్యాండ్ మైన్ పేలి సహచర సైనికుల ప్రాణాలను కాపాడి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఆర్మీ జవాన్ వివి.సుబ్బయ్య భార్య లీలావతి, పిల్లలు, మామ రామకృష్ణ, ఇతర కుటుంబ సభ్యులను గురువారం ఆర్‌డిఓ కేశవనాయుడు, తహశీల్దార్ అరుణకుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ ఉమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌మూర్తి పరామర్శించారు. ఆర్‌డిఓ వారితో మాట్లాడి కుటుంబ వివరాలు, స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు, లబ్ధిని త్వరగా అందేలా కృషి చేస్తామని తెలిపారు. సుబ్బయ్య భార్య లీలావతి తనకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని, పిల్లలను బాగా చదివించాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో తెలిపారు. వారి వెంట గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాము, వీఆర్వో రామాంజనేయులు, వీఆర్ఏలు ఉన్నారు.

13న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పామిడి

పామిడి లయన్స్ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ స్థానిక వాసవి కళ్యాణ మండపంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపాటి తిరుపతినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ శిబిరంలో కంటిలో శుక్లాలు ఉన్న వారికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-పామిడి



ఆత్మహత్యకు పాల్పడిన గౌతమి

పట్టణంలోని గుప్తా కాలనీకి చెందిన బేల్దారి ఉప్పర నారాయణ కుమార్తె ఉప్పర గౌతమి(17) గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గౌతమి తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఇంటర్మీడియట్ చదువుతూ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసింది. మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన సబ్జెక్టులు ఉన్నాయని, ద్వితీయ సంవత్సరం కూడా సరిగా పరీక్షలు రాయలేనందున ఫెయిల్ అవుతానని మనస్థాపం చెందేది. ఈ క్రమంలో తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు చీరతో ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఈతకెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



కాలువలో మునిగి మృతిచెందిన హరినాథ్‌రెడ్డి

స్నేహితులతో కలిసి సరదగా ఈతకెళ్లిన బాలుడు నీటిలో మునిగిపోయి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని దిమ్మగుడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. దిమ్మగుడికి చెందిన ఓబుళరెడ్డి ఉపాధి కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అక్కడ కుమారుడు హరినాథరెడ్డి(15)తో కలిసి ముగ్గుపిండి వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఉగాది పండుగ నిమిత్తం ఇటీవల వారు స్వగ్రామం వచ్చారు. హరినాథరెడ్డి స్నేహితులతో కలిసి సమీపంలోని బెంచి కాలువలో ఈతకు వెళ్లాడు. ఈత సరిగా రాని అతడు లోతు నీళ్లలోకి వెళ్లి మునిగిపోయాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో స్నేహితులు సమాచారం ఇవ్వడంతో బంధువులు అక్కడికి చేరుకుని బెంచి కాలువలో గాలించారు. అప్పటికే హరినాథరెడ్డి మృతిచెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. 8వ తరగతి వరకూ చదివిన హరినాథరెడ్డి ప్రస్తుతం తండ్రితో పాటు హైదరాబాద్‌లోనే ముగ్గుపిండి వ్యాపారం చేసేవాడు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి నేతకు గాయాలు

ప్రజాశక్తి-శింగనమల

కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన టిడిపి మాజీ సర్పంచి అట్టె రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అట్టె రామాంజనేయులు సోదనపల్లి నుంచి శింగనమల మీదుగా అనంతపురం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో కుడి చేయి, కుడి కాలు విరిగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతడిని అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి, ఆ తర్వాత బెంగుళూరుకు తీసుకెళ్లారు. అతివేగం, కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కారు డ్రైవర్‌ను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వరుసగా కేబుల్ వైర్లు చోరీ.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో ఇటీవల తరచూ ఎక్కడో ఓ చోట వ్యవసాయ పొలాల్లో కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మడ్డిపల్లి, కడవకల్లు, చింతకుంట, పుట్లూరు, తదితర గ్రామాల్లో రైతుల పొలాల్లో కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. బుధవారం రాత్రి మడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి తోటలో 3 మోటార్ల కేబుల్ వైర్, సురేష్‌నాయుడు తోటలో ఒక మోటార్ కేబుల్ వైరు చోరీకి గురయ్యాయి. ఇదే గ్రామంలో గత వారంలో ఏడుగురు రైతులకు సంబంధించిన వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న మోటార్లు, కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. పోలీసులు స్పందించి చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారను. చోరీ జరిగిన పంట పొలాలను ఎస్ఐ వెంకట నరసింహ, సిబ్బంది పరిశీలించారు.

రైల్వే స్టేషన్‌లో మేనేజర్ బైక్ చోరీ

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రాత్రి ఓ రైల్వే అధికారికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎ.సురేష్‌బాబు బుకింగ్ కార్యాలయం వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి విధులకు వెళ్లారు. విధులు ముగిసిన అనంతరం వచ్చి చూడగా అక్కడ ద్విచక్ర వాహనం లేకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. వాహనం చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎస్.గూడూరు పంచాయతీ కార్యదర్శి ప్రతి పనికీ లంచం అడుగుతున్నారని, అతడు తమకొద్దని గురువారం గ్రామస్తులు ఎంపిడిఓ అలివేలమ్మకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడు తూ క్యాస్ట్, డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికెట్, తదితర ఎలాంటి సర్టిఫికెట్లు, సేవల కోసం పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. డంపింగ్ యార్డ్‌లో కూడా అవినీతికి పాల్పడుతున్నారని, ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేశారు. అతడిని వెంటనే మరోచోటికి బదిలీ చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శివనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, హరినాథ్‌రెడ్డి, భయపరెడ్డి, వాసుదేవరెడ్డి, ఉదయ్, అశోక్, వరుణ్, అరుణ్, పాండు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-గుత్తి

విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఏడేళ్ల చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు చేపట్టాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎపి ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థినులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడు తూ బాలికలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకళ, భారతి, భార్గవి, కవిత, సావిత్రిబాయి, మహాలక్ష్మి ధనలక్ష్మి, రేష్మ, శోభ, జాను, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.


వెంకటరమణస్వామి ఆలయంలో మరమ్మతులు చేశామంతే : ఈవో

ప్రజాశక్తి-రాయదుర్గం



గర్భగుడిలోని స్వామి, అమ్మవారి మూలవిరాట్

పట్టణంలోని 4 శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ గర్భగుడిలో స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లు పీఠం నుంచి కదలకుండా మార్చి 19, 20 తేదీల్లో మరమ్మతులు చేపట్టినట్లు ఈవో నరసిం హారెడ్డి గురువారం తెలిపారు. గుప్త నిధుల కోసం ఇటీవల మూలవిరాట్‌లను పక్కకి తొలగించి తిరిగి ప్రతిష్టించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో స్పందించిన ఈవో త్వరలో బ్రహ్మోత్సవాలు జరగనున్న దృష్ట్యా విగ్రహాలు వదులుగా ఉంటే ఉత్సవాల సమయంలో ఉపద్రవం సంభవిం చే అవకాశం ఉందని అర్చకులు తెలపడంతో కళాకర్షణ, అష్ట బంధం చేసి విగ్రహాలను తిరిగి ప్రతిష్టించి అర్చకుల సమక్షంలో హోమాలు, పూజలు జరిపి నట్లు ఈవో స్పష్టం చేశారు. స్వల్ప మరమ్మతులు కావడం వల్ల ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. 2011-12లో గర్భగుడిలో గ్రానైట్ బండలు పరచినప్పుడు మరమ్మతులు జరిగాయన్నారు. ప్రస్తుతం మూలవిరాట్ పీఠంలో శ్రీదేవి విగ్రహం వదులుగా ఉందని పూజల సమయంలో అరిష్టం జరిగే అవకాశం ఉందని అర్చకులు తెలపడంతో శాస్త్రీయంగా మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పీఠాన్ని కదిలించలేదని కేవలం పీఠంపై ఉన్న మూలవిరాట్‌లు మొదలైన చోట మరమ్మత్తులు చేయించినట్లు తెలిపారు.



వాస్తవాలు వెల్లడించాలి

బిసివై పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాపరెడ్డి

ఆలయంలో జరిగిన కార్యకలాపాలకు సంబంధించిన వాస్తవాలను వెంటనే వెల్లడించాలని బిసివై పార్టీ నియోజకవర్గం అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి ఓ వీడియో ప్రకటనలో డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పట్టణ ప్రజలకు తెలపకుండా ఇలాంటి చర్యలు ఎందుకు చేపట్టారో ఈవో సమాధానం చెప్పాలన్నారు. విగ్రహాల కదలికలపై 24 గంటల్లోగా సీసీ కెమెరా ఫుటేజీలను విడుదల చేయాలని, లేనిచో జరిగే పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ఈఓ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈవోపై చర్యలు తీసుకోవాలి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు



విలేకరులతో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం లో ఘోర అపచారం జరిగిందని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన ఈవో నరసింహారెడ్డిపై కేసు నమోదు చేసి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాసాని నాగరాజు, బిసి సమన్వయ కమిటీ అధికార ప్రతినిధి శ్రీరాములు, జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, ఆర్యవైశ్య మహాసభ రాయలసీమ ఇన్‌ఛార్జి చంద్ర మహేష్ మీడియాతో మాట్లాడారు. ఉన్నతాధికారులు, భక్తులకు సమాచారం ఇవ్వకుండా విగ్రహాలను తీసి పున:ప్రతిష్టించే అధికారం టిడిపి నాయకుడు గాజుల వెంకటేశు లు, ఈవోకు ఎవరి చ్చారని ప్రశ్నించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను విడుదల చేయాలన్నారు. ఆలయంలో పరిణామాలపై ఇంత చర్చ జరుగుతున్నా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. వారితో పాటు నాయకులు హరి, రత్నమ్మ, జిలాన్ ఉన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఓలో సత్తా చాటారు. విద్యార్థులు 278 పతకాలు సాధించారు. 4వ తరగతికి చెందిన ఆద్రికరాయ్ మొదటి స్థానంలో నిలిచి ల్యాప్‌టాప్ సాధించగా, 197 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. వీరి విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని ఎజిఎం సుబ్బారెడ్డి అభినం దించారు. విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్ల అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, ఏవో గోపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఐఎన్‌టిఎస్ఓ ఒలింపియాడ్ లెవెల్-2 పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. దీంతో గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. మొత్తం 126 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ప్రిన్సిపల్ ఫిలిప్‌కుమార్ విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ తిప్పారెడ్డి, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి సుదర్శన్, లీలావతి, హేమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIM TRIBUNAL PRINCIPAL DISTRICT JUDGE: ANANTHAPURAMU.
M.V.O.P. No: 255/2024

Between:
VEENA RUKMINAMMA ...Petitioner
And
SMD. SHAMEER AHMED& OTHERS ...Respondants

Notice to Respondants No:1 & 2

R1: SMD. SHAMEER AHMED, S/o S.Ameer Basha, Driver of Honda City car, D.No. 2/804, Modinabad Guntakal. (Driver of Crime vehicle,
R2:U.SURESH, S/o B.Danamma, D.No. 2/800, Modinabad, Guntakal (owner of Crime vehicle)

ఇందుమూలముగా ప్రతివాదులు 1 మరియు 2లకు తెలియజేయడం ఏమనగా పై కేసు మీ హాజరుకు గాను 10/04/2025వ తేదికి వాయిదా వేసినారు.కావున ఆ రోజు మీరు ఉదయం 10:30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరాలు దాఖలు చేసుకోవలెను.లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా తేది:10/04/2025

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

కె.రామ్మోహన్ రెడ్డి,
వాదితరుపు న్యాయవాది, అనంతపురం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి-అనంతపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని మలేరియా విభాగం రాష్ట్రస్థాయి డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామనాథం సూచించారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మలేరియా సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య, సచివాలయ సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే జరపాలన్నారు. సక్రమంగా పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో దోమల నివారణకు తరచూ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారులు కె.సత్యనారాయణ, లక్ష్మీనాయక్, ఎంపిహెచ్ఈవోలు వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం డిఎంహెచ్ఒ డా. ఈబి.దేవిని కలిసి మలేరియా, డెంగీ తదితర వ్యాధులు, వాటి నివారణ చర్యలపై చర్చించారు.


కాలనీలో సమస్యను పరిష్కరిస్తున్న టిడిపి నాయకులు, అధికారులు

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

నగరంలో గురువారం కురిసిన అకాల వర్షానికి 39వ డివిజన్‌లో ఇళ్ల మధ్య నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని టిడిపి నాయకుడు గంగారామ్, 39వ డివిజన్ ఇన్‌ఛార్జి చేపల హరి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే ఫోన్ చేయడంతో మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు చేపల హరి, దాదు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి అనంతపురం రూరల్

రూరల్ మండలంలోని ఇటుకలపల్లి గ్రామానికి చెందిన పద్మావతికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 2,05,406 చెక్కును గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో వారికి అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ బెల్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, శ్రీరాఘవేంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిల్స్ పంపిణీ చేసి వాటర్ బెల్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం ఎం.విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గంట గంటకూ నీరు తాగాలన్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ జన్మదినం పురస్కరించుకొని విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు సుంకర రమేష్, కార్యదర్శి జి.ప్రసిల్లా, శ్రీ రాఘవేంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కె.శివ, సభ్యులు రవీంద్ర, నాగరాజు, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్లు కె.మహేంద్ర, జి.నందిత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిరసం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో గురువారం సీనియర్ రచయిత డా.శాంతి నారాయణ నేతృత్వంలో ఏలూరు యంగన్న, డా. రాధేయ, తూముచర్ల రాజారావు, ఉప్పరపాటి వెంకటేశులు ఆధ్వర్యంలో జిరసం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిరసం అధ్యక్షులు డా. జెన్నే ఆనంద్‌కుమార అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వర్ధమాన కవి కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా సీనియర్ కవి కోటిగారి వన్నప్ప, కోశాధికారిగా లబ్ధప్రతిష్ట కవి, మధురం కవి మధురశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిరసం మహిళా ప్రతినిధి విద్యావతి, గోసల నారాయణస్వామి, ఎల్ఆర్.వెంకటరమణ, డా.అంకె శ్రీనివాస్, చేగువేరా హరి, ఒంటెద్దు రామలింగారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సీర్పి చంద్ర శేఖర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-పామిడి

సత్యసాయిబాబా శత జయంతి సంవత్సరం సందర్భంగా గురువారం సత్యసాయిబాబా సంఘం అధ్యక్షులు విశ్వనాథ్, రాజేశ్వరి వారి సొంత నిధులతో పామిడి పంచాయతీ, ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులు, వివిధ ఆలయాలలో పనిచేస్తున్న మహిళలు మొత్తం 39కి చీరలు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి సేవకులు, ఆయా శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్‌కు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమ వుతాయని, విద్యార్థులు పదో తరగతి హాల్ టికెట్‌తో అడ్మిషన్ పొందవచ్చని ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. ఇప్పటికే ద్వితీయ సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయని విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలన్నారను. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసితో పాటు నూతనంగా ఎంబైపిసి, వృత్తి విద్య కోర్సులో వివిధ గ్రూపులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ప్రభుత్వ ఫెర్రర్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ మోహన్ తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు అడ్మిషన్ పొందాలని సూచించారు.

జగన్.. బిసి అధికారుల జోలికొస్తే ఖబడ్దార్..!

ప్రజాశక్తి-అనంతపురం

రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌ను బ్రోకర్ అని వైసిపి అధ్యక్షులు జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి స్టూడెంట్స్ జెఎసి జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ తెలిపారు. నగరంలోని జెఎసి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీతి నిజాయితీగా పనిచేస్తున్న ఎస్ఐ సుధాకర్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోకపోతే బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా ఏకమై 2029 ఎన్నికల్లో కూడా వైసిపికి గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. ఓ పోలీస్ అధికారిపై ఇంత దౌర్జన్యంగా, అన్యాయంగా ఆరోపణలు చేస్తుంటే పోలీసు అధికారుల సంఘాలు ఎక్కడ అని ప్రశ్నించారు.

'అనంతలక్ష్మీ'లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రపంచ నీటి దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం నగర శివారులోని 'అనంత లక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అనంతపురం లోకల్ చాప్టర్ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా. రామకృష్ణారెడ్డి, విశిష్ట అతిథిగా సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నీటి ప్రాధాన్యత, పొదుపు గురించి వివరించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రిన్సిపల్ డా. రామ్మూర్తి మాట్లాడుతూ నీటి వినియోగాన్ని, సంరక్షణను మరింత జాగ్రత్తగా చూడాల్సిన అవసరం ఉందిన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ డా. రాయుడు, జాతీయ సేవా పథం అధికారులు ఖలీల్‌బాషా, నవీన్ కుమార్, ఏఓ చౌదరి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డా॥రామకృష్ణారెడ్డి

'ముస్లిముల హక్కులను కాలరాసిన చంద్రబాబు'

ప్రజాశక్తి -అనంతపురం

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును సమర్థించడం ద్వారా సిఎం చంద్రబాబు ముస్లింల హక్కులను కాలరాశారని వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు బాకే హబీబులా గురువారం ఓ ప్రకటనలో విమర్శిం చారు. రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులు వారి మత పరమైన వ్యవహారాలు నిర్వహించుకునే హక్కు ఉందన్నారు. కానీ బిజెపి ప్రభుత్వంతో చేతులు కలిపిన చంద్రబాబు సెక్యులర్ భావాలను పక్కన బెట్టి ముస్లిం మైనారిటీల హక్కులను కాల రాసి తీరని అన్యాయం చేశారన్నారు. ఎన్నికల ముందు ముస్లిం లకు అండగా ఉంటామని మాట ఇచ్చిన చంద్రబాబు అధికారంలో వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును సమర్థించడం దుర్మార్గమన్నారు. ముస్లింలకు అన్యాయం జరిగేలా బిజెపి బాటలో నడుస్తున్న చంద్రబాబుకు భవిష్యత్తులో ముస్లింలు సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడు గ్రామంలో గురువారం డిఎల్‌పిఒ విజయభాస్కర్‌రెడ్డి ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఆయన ముందుగా ఈవోఆర్‌డి శైలజరాణి, సర్పంచి రమణకుమారితో కలిసి గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పొడి చెత్త, తడి చెత్తపై అవగాహన కల్పించారున. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ గ్రామ పరిశుభ్రతకు కృషి చేయాలని సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని రిశీలించారు. వారి వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

బాల్య వివాహాలపై సదస్సు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని నింబగల్లు గ్రామంలో గురువారం పెద్దకౌకుంట్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పివి అనికేత్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, టీనేజ్ గర్భంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ బాల్యవివాహాలు, టీనేజ్ గర్భం వల్ల జరిగే నష్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై వైద్య సిబ్బందికి వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ మాట్లాడుతూ బాల్యవివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడినా, ప్రోత్సహిం చినా జైలుశిక్ష, జరిమానా తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎం. ప్రసాద్‌రావు, ఎఎన్ఎం నాగమ్మ, ఎంఎల్‌హెచ్ మౌనిక, ఆశా కార్యకర్తలు ఉమాదేవి, శాంతి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని ఆవులెన్న గ్రామంలో రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను గురువారం శాస్త్రవేత్తలు, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. వారం క్రితం తన పొలంలో మొక్కజొన్న పంట విత్తనం వేయగా నాసిరకం విత్తనం కావడంతో పంట సరిగా రాలేదని రైతు చాకలి మల్లికార్జున ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వ్యవసాయ అధికారిణి ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించారు. ఆ పొలంలోని మట్టి, నీరు, పంట నమూనాలను సేకరించి పూర్తి నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి అందజేస్తామని తెలిపారు. పరిశీలించిన వారిలో శాస్త్రవేత్తలు మాధవిలత, లక్ష్మణ్, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చెంగల్‌రాయుడు, ఎడిఎ ఎల్లప్ప, ఏవో పృథ్వీసాగర్, సర్పంచి రామ్మోహన్ చౌదరి, రైతులు మల్లికార్జున, కుళ్లాయప్ప, గ్రామ వ్యవసాయ అధికారి తులసి ఉన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయండి : జెడిఎ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, కడవకల్లు రైతు సేవా కేంద్రాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ సందర్శించారు. రైతు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఆమె ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆమె ఎడిఎ చెంగళరాయుడు, ఏవో కాత్యాయిని, ఎఇఒ హరి, విహెచ్ఎ మురళి, మనోరమ, విఎస్ఎ సర్ఫరాజ్, రైతులు ఉన్నారు.